


పడతీ.. నీదే జగతి



మహిళా దినోత్సవంలో నృత్యకారిణి విన్యాసం

మహిళా దినోత్సవ సమయాన జనమంతా సత్సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. పడతీ.. నీదే జగతి అంటూ జై కొట్టారు. ఎక్కడికక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వారి పరిధిలోని పడతులను సగౌరవంగా సత్కరించారు. యత్ర నార్యస్తు పూజ్యంతే.. అన్న ఆర్యోక్తిని నిజం చేసి చూపించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



జిల్లా మహిళా పోలీసుల సెల్ఫీ





తప్పు ఎవరిది.. శిక్ష ఎవరికి?

- బాయ్స్ అదనపు వసూళ్లు చేశారని, గోడౌన్‌లో స్టాక్ తేడాలున్నాయని ఇండేన్ గ్యాస్ గోడౌన్ సీజ్
- పొందూరు, ఎచ్చెర్ల, జి.సిగడాం, లావేరు, సంతకవిటి వినియోగదారులకు ఇక్కట్లు
- రణస్థలం ఏజెన్సీకి ఇక్కడి సరఫరా బాధ్యతలు అప్పగింత
- గ్యాస్ రాక ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కొందరు గ్యాస్ బాయ్స్ దురాశ, అధికారుల వైఖరి.. కలగలిపి ఐదారు మండలాల ప్రజలను ఇక్కట్లలో పడేశాయి. గ్యాస్ డెలివరీ వ్యవస్థలో అదనపు వసూళ్లు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. కానీ పొందూరులోని గ్యాస్ ఏజెన్సీపై మాత్రం చర్యలు తీసుకున్నారు. ఒకరిద్దరు బాయ్స్ అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని, తనిఖీలు చేసిన మూడు రోజుల తర్వాత స్టాక్‌లో తేడాలున్నాయని చెప్పి ఏకంగా గ్యాస్ గోడౌన్‌కు తాళాలు వేశారు. సుదూర ప్రాంతంలో ఉన్న మరో ఏజెన్సీకి అప్పగించడంతో లబ్ధిదారుల ఇంటికి గ్యాస్ బండలు రావడం లేదు.

ఏం జరిగిందంటే..?

ఈ నెల 1వ తేదీన కలెక్టర్ పొందూరులో పర్యటిస్తూ కొందరి ఇంటి వద్దకు వెళ్లి గ్యాస్ సరఫరాపై ఆరా తీశారు. అక్కడ కొందరు వాస్తవ ధర కంటే రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని చెప్పుకొచ్చారు. దీనిపై వెంటనే విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను, జిల్లా పౌరసరఫరాల అధికారిని ఆదేశించారు. అక్కడి నుంచి ఒక్క ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ మాత్రమే టార్గెట్ అయింది.



గ్యాస్ బండల మోత కష్టాలు

వినియోగదారులకు గ్యాస్ ఇక్కట్లు

పొందూరులో ఉన్న గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ సీజ్ చేసి, రణస్థలంలోని గ్యాస్ ఏజెన్సీకి అప్పగించడమైతే చేశారు గానీ బుక్ చేసిన వినియోగదారులకు గ్యాస్ సరఫరా మాత్రం చేయడం లేదు. ఆ ఏజెన్సీకి అంత సామర్థ్యం లేకపోవడం ఒక ఎత్తు అయితే, సరఫరా చేయమని ఏ అధికారులైతే చెప్పారో ఆ అధికారులే ఇన్‌డైరెక్ట్‌గా మళ్లీ చెప్పేంతవరకు సరఫరా చేయవద్దు అని హుకుం జారీ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా పొందూరు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ పరిధిలోని పొందూరు, సంతకవిటి, ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, శ్రీకాకుళం రూరల్‌లోని కొన్ని గ్రామాలకు గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. ఖాళీ సిలిండర్లు మోసుకుంటూ పొందూరు గ్యాస్ ఏజెన్సీకి వెళ్తే అక్కడా బండ దొరకడం లేదు.

చర్య సరైనదేనా?

వాస్తవంగా గ్యాస్ ఏజెన్సీకు సంబంధించి ఎలాంటి తప్పులు జరిగినా ఆ మేరకు నోటీసు జారీ చేసి, అక్కడ వరకు జరిగిన లావాదేవీలపై అపరాధ రుసుం విధించాల్సి ఉంటుంది. అవకతవకలను సంబంధిత గ్యాస్ కంపెనీలకు నివేదించి, తదుపరి వినియోగదారులకు ఇబ్బంది లేకుండా అదే గ్యాస్ ఏజెన్సీ నుంచి గ్యాస్ సరఫరా చేయించాలన్న వాదనలు ఉన్నాయి. కానీ, ఇక్కడదేమీ చేయకుండా ఏకంగా గోడౌన్‌కు తాళాలు వేసి, ఇక్కడ సరఫరా బాధ్యతను రణస్థలంలోని ఏజెన్సీకి అప్పగించారు. ఇప్పుడిది వినియోగదారుల ఇక్కట్లకు తావిచ్చింది. ఈ నెల ఒకటో తేదీ నుంచి బుక్ చేసుకున్న దాదాపు 2 వేల మందికి గ్యాస్ సరఫరా కాని పరిస్థితి ఏర్పడింది.

తొలుత ఆచితూచి.. తర్వాత సీజ్ చేసి

కలెక్టర్ పర్యటనతో మొదలైన విచారణ తహసీల్దార్, డీఎస్ఓ, జాయింట్ కలెక్టర్ వరకు సాగింది. తొలుత మందలించి, సక్రమంగా నడుపుకోవాలని సూచించారు. మళ్లీ రోజు వ్యవధిలో ఏమైందో తెలియదు గాని మళ్లీ గోడౌన్‌లో తనిఖీలు చేసి, స్టాక్‌లో తేడాలున్నాయని గుర్తించి ఏకంగా గోడౌన్‌కు తాళాలు వేసేశారు. అంతేకాకుండా ఇక్కడి వినియోగదారులకు బుక్ చేసిన గ్యాస్‌ను డెలివరీ చేసే బాధ్యతను రణస్థలంలోని ఓ గ్యాస్ ఏజెన్సీకి అప్పగించారు. ఇప్పుడిదే సమస్యగా మారింది.



గ్యాస్ గోడౌన్‌కు తాళాలు

ఆ ప్రజాప్రతినిధికి లైన్ క్లియర్..

రాజకీయ కక్షసాధింపుల్లో భాగంగా అక్కడి గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను దెబ్బ కొట్టాలని గత కొన్నాళ్లుగా అదను కోసం ఓ ప్రజాప్రతినిధి ఎదురు చూస్తున్నారు. కరెక్ట్‌గా ఇదే సమయంలో ఏకంగా కలెక్టర్ పర్యటనలో అదనపు వసూళ్లు చేస్తున్నారని కొందరు చెప్పడం, వారిని డీఎస్ఓ, తహసీల్దార్ తదితర అధికారుల విచారణలో స్టేట్‌మెంట్ ఇవ్వడంతో కక్ష సాధింపు కోసం వేచి చూస్తున్న సదరు ప్రజాప్రతినిధికి లైన్ క్లియర్ అయింది. ఎలాగోలా ఆ ఏజెన్సీని తన చేతులోకి తెచ్చుకోవాలన్న కుట్రతో పావులు కదుపుతున్న ప్రజాప్రతినిధికి ఇదొక మంచి అవకాశంగా దొరికింది.

రణస్థలం ఏజెన్సీకి అప్పగించాం

కలెక్టర్‌కి వినియోగదారులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎస్ఓ విచారణ జరిపారు. అదనపు వసూళ్లు చేస్తున్నట్టు, స్టాక్‌లో వ్యత్యాసాలు ఉన్నట్టు గుర్తించారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. డీఎస్ఓ ఆధ్వర్యంలో సీజ్ చేశాను, రణస్థలం ఏజెన్సీకి అప్పగించాను.

– వెంకటేష్ రామానుజుల, తహసీల్దార్ (ఎఫ్ఏసీ), పొందూరు

టీడీపీ నాయకులే నిలుపుదల చేయించారు



టీడీపీ నాయకులే గ్యాస్ నిలుపుదల చేయించారు. గ్యాస్ బుక్ చేసి వారం రోజులైంది. ఇప్పటికీ ఇవ్వలేదు. ప్రజలకు ఇబ్బంది పెడుతున్నారు. దీనిపై జేసీ, కలెక్టర్ తగు చర్యలు తీసుకొని ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలి.

– చిగిలిపల్లి రాజారావు, లబ్ధిదారుడు, ఎరుకలపేట.

పది సార్లు తిరిగాను



గ్యాస్ బుక్ చేసి ఐదు రోజులైంది. ఎంతకీ రాలేదు. గురువారం నుంచి పది సార్లు తిరిగాను. కానీ, గ్యాస్ ఇవ్వడం లేదు. గ్యాస్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కలెక్టర్ వెంటనే స్పందించి మాకు గ్యాస్ ఇప్పించేలా ఏర్పాట్లు చేయండి. – కొండల సతీష్, వాండ్రంగి, జి.సిగడాం మండలం.



ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద వినియోగదారుల పడిగాపులు

నేడు, రేపు కిరణ దర్శనం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో అద్భుత దృశ్యానికి వేళయ్యింది. ఉత్తరాయణం నుంచి దక్షిణాయణానికి కాలమార్పుల్లో భాగంగా.. ఆది, సోమవారాల్లో సూర్యోదయ సమయాన ఆదిత్యుని గర్భాలయంలోని మూలవిరాట్టుపై తొలి సూర్యకిరణాలు స్పృశించనున్నాయి. ఈ అద్భుత దృశ్యాన్ని భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు అధికారులు పక్కా ఏర్పాట్లు చేస్తున్నారు. రాజగోపుర ద్వారం నుంచి మహా మండపం, సుదర్శన మండపాల వరకు ఏర్పాట్లు చేశారు.

అందిన ద్రాక్ష తీయన





జాతీయ రహదారిపై ద్రాక్ష పండ్లు కాశాయి. గుత్తులు గుత్తులుగా పడి ఉన్న ద్రాక్ష పండ్లను చూసి ప్రయాణికులు కూడా ఆగలేకపోయారు. ఎవరికి దొరికినంత వారు తీసుకెళ్లిపోయారు. ఎచ్చెర్ల పరిధిలోని కేశవరావుపేట వద్ద జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం ద్రాక్ష పండ్ల లారీ బోల్తా పడింది. డ్రైవర్ మధుకర్ స్టీరింగ్ నియంత్రణ కోల్పోవడంతో బండి దారికి అడ్డంగా పడిపోయింది. దీంతో రోడ్డుపై పడిన ద్రాక్ష పండ్లను తీసుకెళ్లడానికి జనం ఎగబడ్డారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.నందీప్‌కుమార్‌తో కూడిన సిబ్బంది, హైవే సిబ్బంది చేరుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. బండిలో ఉన్న వారికి స్వల్ప గాయాలయ్యాయి.

– ఎచ్చెర్ల క్యాంపస్

క్లుప్తంగా

ఉపాధి కోర్సుల్లో మహిళలకు శిక్షణ

శ్రీకాకుళం రూరల్: ఎచ్చెర్లలోని ఎన్టీఆర్ మహిళా ప్రాంగణంలో మహిళలకు ఉపాధి కల్పించే దిశగా నూతన కోర్సులను నిర్వహించనున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బేబికేర్ టేకర్, వేర్ హౌస్ అసోసియేట్, ఫార్మా స్టోర్ అసోసియేట్, జనరల్ డ్యూటీ అసిస్టెంట్, పేషెంట్ రిలేషన్స్ కోర్సులను ఈ నెల 17 నుంచి ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఐదు నుంచి పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుంచి 45 ఏళ్ల మహిళలు అర్హులని తెలిపారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, పూర్తి వివరాలకు 7680945357, 7995013422 నంబర్లను సంప్రందించాలని కోరారు.

వేతనాలు పెంచాలని వినతి

ఎచ్చెర్ల క్యాంపస్: ట్రిపుల్ ఐటీలో 2018 నుంచి పని చేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీకి వేతనాలు పెంచాలని కోరుతూ సిబ్బంది శనివారం ఎస్ఎం పురం ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

టెక్కలి రూరల్ : ధర్మనీలాపురం గ్రామానికి చెందిన గురుబెల్లి కృష్ణారావు(65) శనివారం సాయంత్రం రైలు ఢీకొని మృతి చెందాడు. కృష్ణారావు రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఈ ఘటన సంభవించింది. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునే సరికి మృతదేహం మాయమైనట్లు తెలుస్తోంది.

డ్రోన్ టెక్నాలజీపై అవగాహన

ఎచ్చెర్ల క్యాంపస్: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) ఎస్ఎం పురం క్యాంపస్‌లో నిర్వహిస్తున్న జాతీయ టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్ (టెక్నివర్స్ 2025) శనివారం కూడా కొనసాగింది. విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీ, ప్రాజెక్టు ఎక్స్‌పో వంటివి నిర్వ హించారు. ఐఐటీ గువాహటి నుంచి రీసోర్సు పర్సన్‌గా హాజరైన ప్రొఫెసర్ విజయ సారథి మిషన్ లెర్నింగ్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కన్వీనర్ గేదెల రవి, సహాయ కన్వీనర్ తేజ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్ : శ్రీకాకుళం బీసీ స్టడీ సర్కిల్ ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఏపీ బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు ఇ.అనురాధ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెట్ అర్హత సాధించి జిల్లాకు చెందిన బీసీ, ఈబీసీ కేటగిరీల అభ్యర్థులు అర్హులని, వివరాలకు శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డులోని బీసీ స్టడీ సర్కిల్ వద్ద గానీ, 7382975679, 9295653489 నంబర్లను గానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

రాష్ట్ర ఇంటెలెక్చువల్ ఫోరం విభాగం నియామకం




పిల్లల రామకృష్ణ సీపాన వెంకటరావు ఎస్.భీమాచార్యులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఇంటెలెక్చువల్ ఫోరం విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పిల్లల రామకృష్ణ, కార్యదర్శిగా సీపాన వెంకటరావు, సంయుక్త కార్యదర్శిగా ఎస్.భీమాచార్యులను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కమిటీలో జిల్లా నుంచి వీరికి అవకాశం కల్పించారు.

కిడ్నీ మందులకు కోత

- బాధితులపై తప్పని ఆర్థిక భారం
- బయటే కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి
- నిర్లక్ష్యం వహిస్తున్న కూటమి సర్కారు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కిడ్నీ బాధితులకు డయాలసిస్ ఎంత ముఖ్యమో.. మందులూ అంతే కీలకం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కిడ్నీ రోగులకు ప్రభుత్వం అవసరమైన కీలక మందులను ఉచితంగా అందిస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక బడ్జెట్ కొరతతో ప్రభుత్వాసుపత్రులకు పూర్తిగా మందులు సరఫరా చేయడం లేదు. కీలకమైన మందులకు కోత పెడుతోంది. అసలే కిడ్నీ రోగంతో చిదికిపోయిన కుటుంబాలకు రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లడం, రోజుల తరబడి డయాలసిస్ కోసం వేచి ఉండటం, దానికయ్యే ఖర్చులు భారంగా మారుతుంటే దానికి తోడు ప్రభుత్వం మందులు సరఫరా చేయకుండా చేతులేత్తేయడంతో వారి ఆర్థిక బాధలు రెట్టింపవుతున్నాయి. మందులు కొనుగోలు చేసుకోలేని పరిస్థితిలో రోగులు చనిపోతున్న సంఘటనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా సోడియం బై కార్బొనెట్ వంటి కీలక మందులు ఇవ్వడం లేదు. పత్రికల్లో వస్తే అప్పటికప్పుడు ఒక్కో స్ట్రిప్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. వారానికి ఒకసారి రక్తం ఇంప్రూమెంట్ కోసం ఇంజక్షన్ వేస్తుంటారు. ఇవి కూడా అప్పుడప్పుడు ఇవ్వడం లేదు. స్టాక్ ఉంటే ఇస్తున్నారు. లేదంటే కొనుక్కోమంటున్నారు. వేలాది రూపాయల విలువైన ఐరన్ ఇంజక్షన్ పరిస్థితి కూడా అంతే. బయట కొనుగోలు చేసుకోమని చెబుతున్నారు.



మందులు బయటే..



ఏడాదిన్నర నుంచి కవిటి డయాలసిస్ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటున్నాను. గతంలో డయాలసిస్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మందులు ఇచ్చేవారు. ప్రస్తుతం చాలా వరకు బయటనే కొనుక్కోవాల్సి వస్తోంది. నెఫ్రాలజిస్ట్ డాక్టర్ లేకపోవడంతో ఇక్కడ డయాలసిస్ రోగులంతా నెలకు ఒకసారి విశాఖపట్నం వెళ్లి అక్కడ చూపించాల్సి వస్తోంది.

– బినాయిక్ బిసాయి, కుసుంపురం, కవిటి మండలం

టెస్టుల కోసం భారీగా ఖర్చు..

కవిటి, సోంపేట, పలాస డయాలసిస్ సెంటర్లలో రోగులకు ఆర్థిక భారం తప్పడం లేదు. డయాలసిస్ చేసుకోవాలంటే చేతికి, మెడకు, గుండెకు, తొడలకు వేయాల్సిన ఎక్విప్‌మెంట్‌ను రూ.4 వేల నుంచి రూ.30 వేల వరకు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. బ్లడ్ ఇన్‌ఫెక్షన్ కల్చర్ టెస్ట్ చేయించుకోవాలి. ప్రభుత్వాసుపత్రుల్లో చేయకపోవడంతో బయ ట రూ.1000 నుంచి రూ.2వేల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి. యూరిన్ ఇన్‌ఫెక్షన్ కల్చర్ టెస్ట్ కోసం శ్రీకాకుళం, విశాఖపట్నం పంపించాల్సి వస్తోంది. ఇందుకు రూ.2వేలు వరకు ఖర్చవుతోంది.

జీవనాధారంపై దెబ్బ..

కుటుంబంలో ఒకరికి డయాలసిస్ చేయించుకోవాల్సివస్తే ఆ కుటుంబంలో మరొకరికి జీవనాధారం కరువవుతోంది. రెండురోజులకు ఒకసారి రోగితో పాటు ఆస్పత్రికి వచ్చి నిరీక్షించాల్సిన పరిస్థితి. ఇచ్ఛాపురం నుంచి సోంపేటకు ఆటోలో వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్న వారు టోకున రూ.1200 చెల్లించాల్సిన పరిస్థితి. గతంలో 108 ద్వారా రోగులను డయాలసిస్ సెంటర్‌కు తరలించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. రోగులు సొంత ఖర్చులతో వెళ్లాల్సి వస్తోంది.

ఇంజక్షన్లు సరఫరా చేయాలి



కొండి పుట్టుగ గ్రామానికి చెందిన మా అమ్మ శాంతమ్మ సోంపేట డయాలసిస్ కేంద్రంలో డయాలసిస్ చేయించుకుంటుంది. ప్రస్తుతం ఐరన్ ఇంజక్షన్లు ప్రభుత్వం సరఫరా చేయడం లేదు. అవి కొనలేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రక్తశుద్ధి ఇంజక్షన్లు ఒక్కొక్క సారి కొరత వస్తోంది.

– నర్తు దుర్యోధన, కొండిపుట్టుగ, కవిటి మండలం

లక్షన్నర ఖర్చు..



మాది తీరప్రాంతం సీహెచ్ కపాసుకుద్ది. కష్టపడే కుటుంబంలోనే పుట్టాను. ఎందుకో ఈ అంతుచిక్కని వ్యాధి సోకింది. రెండునెలలుగా డయాలసిస్ చేస్తున్నారు.ఆరోగ్యశ్రీలో భాగంగా శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో డయాలిసిస్‌లు అయ్యాయి. వైద్యం కోసం ఇప్పటి వరకు రూ.1.5 లక్షలు అప్పు చేయాల్సి వచ్చింది. కవిటిలో డయాలసిస్ అయితే మా కష్టాలు తీరుతాయి.

– ఆర్.ముకుందరావు, సీహెచ్.కపాసుకుద్ది, కవిటి మండలం

ప్రతిసారీ రూ.4వేలు ఖర్చు..



పదేళ్లుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాను. కవిటి ప్రభుత్వ డయాలసిస్ సెంటర్‌కు వెళితే బెడ్‌లు ఖాళీ లేవన్నారు. దీంతో పలాసలో ఓ ప్రైవేట్ సెంటర్‌లో మూడుసార్లు వెళ్లా. ఒక్కసారికే రూ.4000 ఖర్చయింది. దీంతో శ్రీకాకుళంలోని జెమ్స్‌లో ప్రస్తుతం డయాలసిస్ ఆరోగ్యశ్రీలో చేయించుకుంటున్నాను. ఆస్పత్రి బస్‌కు కవిటి నుంచి తీసుకెళ్లి తీసుకొస్తున్నారు. బస్సు తప్పిపోతే ట్రైన్‌కు వెళ్లొస్తున్నాను. కవిటి ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేస్తేనే రూ.10,000 పెన్షన్ వస్తుందంటున్నారు.

– కె.తిరుపతిరావు, మధ్యపుట్టుగ, కవిటి మండలం

12న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో యువత పోరు



సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12న 'యువత పోరు' కార్యక్రమం నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పడక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారికి జరుగుతున్న అన్యాయాన్ని వివరించాలన్నారు. ఈ నెల 12న పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఉన్నందున అన్ని నియోజకవర్గాల్లో పార్టీ జెండా ఎగురవేయాలన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయసాయిరాజ్, కళింగకుల రాష్ట్ర అధ్యక్షుడు దుంపల లక్ష్మణరావు, ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షులు ఎంవీ స్వరూప్, టెక్కలి నియోజకవర్గ సమన్వయ కర్త పేరాడ తిలక్, ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ముంజేటి కృష్ణ, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉలాల భారతి, అంబటి శ్రీనివాసరావు, గొండు రఘు, మూకళ్ళ తాతబాబు, పీస గోపి, చల్ల రవికుమార్ లతో పాటు అధిక సంఖ్యలో పార్టీముఖ్య నేతలు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పాలనలోనే మహిళా సాధికారత



కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్. చిత్రంలో పిరియా విజయ, ఉలాల భారతి, మహిళా విభాగం నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మహిళలు రాజకీయ, సామాజిక ఎదుగుదలకు అత్యధిక ప్రాధాన్యమిచ్చినది మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీజిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శ్రీకాకుళంలో జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఉలాల భారతి ఆధ్వర్యంలో శనివారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ప్రతి కుటుంబం వద్ద లక్షలాది రూపాయలు ఉండేవని, ప్రతి పథకాన్ని మహిళా ఖాతాల్లో వేసి కుటుంబ అభివృద్ధికి బాటలు వేశారని గుర్తు చేశారు. చంద్రబాబు అధికార దాహంతో మహిళలకు లేనిపోని హామీలన్నీ ఇచ్చి ఒక్కటి కూడా అమలుచేయకుండా మోసగించారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ హయాంలో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, చైర్మన్ పదవులన్నీ 70 శాతం మహిళలకే ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంపై తొమ్మిది నెలల్లోనే మహిళలంతా మండిపడుతున్నారని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయసాయిరాజ్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు గుర్తించి పదవులిచ్చిన క్రమంలోనే తనకు జిల్లా పరిషత్ చైర్మన్ పదవి దక్కిందన్నారు. పార్టీలకు అతీతంగా పథకాలు వర్తింపజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మహిళా నేతలు అంబటి నిర్మలా శ్రీనివాస్, మూకళ్ల సుగుణ, కోరాడ ఆశాలత, రాజాపు హైమావతి, చింతు అన్నపూర్ణ, జి.వెంకటరమణి, చల్ల సుగుణా, టి.కామేశ్వరి, గుంట జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3కే రన్



రన్, వాక్ ర్యాలీలో పాల్గొన్న ఔత్సాహికులు (ఇన్‌సెట్లో) క్రీడాజ్యోతితో గొండు స్వాతి శంకర్, పైడిశెట్టి జయంతి, బోయిన నిర్మల తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో శనివారం జీఎన్‌వీ జ్యూయలర్స్ ఆధ్వర్యంలో 3కే రన్, వాక్ ఉత్సాహభరితంగా సాగింది. జీఎన్‌వీ జ్యూలయర్స్ ఎండీ కిరణ్, పృథ్వీ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని 80 అడుగుల రోడ్డులో మహిళలకు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతిశంకర్ జెండా ఊపి ప్రారంభించారు. శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ పైడిశెట్టి జయంతి క్రీడాజ్యోతిని వెలిగించారు. 30 ఏళ్లలోపు, 30 నుంచి40 ఏళ్ల మధ్య విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎన్‌వీ ఎండీలు బోయిన నిర్మల, సంయుక్త, ఊన్న సుజాత తదితరులు మాట్లాడుతూ మహిళలకు ఓర్పు, సహనం, అణుకువ ఆభరణాలతో సమానమన్నారు. అనంతరం 3కే వాక్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. అంతకుముందు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వందన షాపింగ్ మాల్, క్వాంటమ్ ఈ బైక్స్, హెచ్‌కే ఏజెన్సీ, గ్రాండ్ హోటల్ కార్యక్రమానికి సహకరించినందుకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్లు పైడి సింధూర, కింజరాపు షర్మిళ, పీఈటీలు సాంబమూర్తి, వెంకటరమణ, జెసీఐ మెయిన్ బెందాళం వరలక్ష్మి, తమ్మినేని ఉషా రాణి, యోగా టీచర్ తంగి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

అండర్-30 విభాగంలో పైడి వసంత, ఎస్.శార్వాణి, మేరీ గ్రేస్ తొలి మూడు స్థానాల్లో నిలవగా సీహెచ్ భార్గవి, జి.దివ్య, హెచ్.కల్పన, వి.సంధ్యారాణి ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. 30 నుంచి 40 ఏళ్ల విభాగంలో వి.నాగమణి, అరుణకుమారి, బి.కృష్ణకుమారి తొలి మూడు స్థానాలు సాధించగా..పి.లక్ష్మీప్రసన్న, ఎం.రోజా, జి.సూర్యకుమారి, కె.అశ్విని ఆ తర్వాత స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు.

హెల్త్‌సిటీలో రక్త రుగ్మతల కేంద్రం ప్రారంభం



హెల్త్‌సిటీ యునిక్ ఆస్పత్రిలో రక్త రుగ్మతల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హెమటాలజీ పితామహుడు డాక్టర్ మామ్మెన్ చాండీ

ఆరిలోవ: హెల్త్‌సిటీ యునిక్ ఆస్పత్రిలో మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో రక్త రుగ్మతుల కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఈ కేంద్రాన్ని హెమటాలజీ పితామహుడు డాక్టర్ మామ్మెన్ చాందీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో సికిల్ సెల్, తలసేమియాతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఉన్నారన్నారు. అలాంటి వారికి ఈ కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండే విధంగా ఈ కేంద్రాన్ని నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఈ కేంద్రం విశాఖలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఊన్న మురళీకృష్ణను అభినందించారు. నిమ్స్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సదాశివుడు మాట్లాడుతూ విశాఖలో రక్త రుగ్మతుల కేంద్రం ఏర్పాటు చేయడం వల్ల ఆరోగ్య సంరక్షణలో కీలక ముందుడుగు పడిందన్నారు.దీర్ఘకాలిక వ్యాధులు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. అలాంటి సమస్యల నివారణకు ఈ కేంద్రం అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ ఏపీతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో ఎక్కడా రక్త వ్యాధులను సమగ్రంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా హెమటాలజీ కేంద్రం లేదన్నారు. ఈ లోటును భర్తీ చేయడానికి ఇక్కడ సమగ్ర రక్త రుగ్మతల కేంద్రం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పలువురు ఆంకాలజీ విభాగం వైద్యులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా గుట్టురట్టు



పాతపట్నం: వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామారావు

పాతపట్నం: గంజాయి తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లా తిరుమల్‌లెయిల్ గ్రామానికి చెందిన ధనుష్ ఏకాంబరంను శనివారం అరెస్టు చేశామని సీఐ వి.రామారావు తెలిపారు. పాతపట్నం అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వైపు పర్లాకిమిడి (ఒడిశా) నుంచి నడుకుంటూ వస్తున్న ధనుష్ వద్ద 4.596 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఒడిశాలోని బల్లిగుడా వెళ్లి రాజు అలియాస్ దొరవద్ద రూ.10 వేలుకు గంజాయి కొనుగొలు చేసి వస్తున్నట్లు గుర్తించామన్నారు. సమావేశంలో ఎస్ఐ బి.లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి విక్రేతపై కేసు నమోదు

ఆమదాలవలస: పట్టణ రైల్వేస్టేషన్ జంక్షన్‌లో కిళ్లీ కొట్టులో గంజాయి విక్రయిస్తున్న పొట్నూరు కృష్ణారావుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఆమదాలవలస ఎస్ఐ ఎస్.బాలరాజు తెలిపారు. 70 గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని, ఆమదాలవలస జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు తరలించినట్లు చెప్పారు.

మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా శ్రీకాకుళం



ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్

శ్రీకాకుళం అర్బన్: ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసి శ్రీకాకుళాన్ని మహిళా పారిశ్రామికవేత్తల హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ బి.శాంతిశ్రీ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా సాధికారతకు ప్రభుత్వం చేస్తున్న కృషిని మంత్రి వివరించారు. అనంతరం పలువురు మహిళలకు ప్రోత్సాహకాలు, పురస్కారాలు, చెక్‌లు, బాలికలకు ల్యాప్‌టాప్‌లు, మహిళా డ్రైవర్లకు ఆటోలు అందజేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస, నరసన్నపేట, పలాస ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, గౌతు శిరీష ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, సీపీవో ప్రసన్నలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ, బీసీ కార్పొరేషన్ ఈడీ గెడ్డమ్మ, లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్య కిరణ్, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ కె.కవిత, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఈ.అనురాధ, పలు విభాగాలకు చెందిన మహిళ ఉద్యోగులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై కన్నకొడుకు దాష్టీకం!



ఎస్పీ కార్యాలయం వద్ద వృద్ధురాలు సౌభాగ్య

శ్రీకాకుళం క్రైమ్ : మహిళా దినోత్సవం నాడు ఆ మాతృమూర్తి రోధన వర్ణనాతీతం. కన్నకొడుకు చెక్కతో కొట్టి రోడ్డుపైకి అమాంతం నెట్టేసి 13 రోజులవుతున్నా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో నేరుగా ఎస్పీ మహేశ్వరరెడ్డి వద్ద మొరపెట్టుకునేందుకు కుమార్తెతో సహా జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చింది. ఉదయం 11:30 గంటలకు వచ్చిన ఆమె సాయంత్రం 3:10 గంటల వరకు ఎదురు చూసి వెనుదిరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. లావేరుకు చెందిన 60 ఏళ్ల వృద్ధురాలైన సౌభాగ్య భర్త అప్పారావు అంగవైకల్యంతో 11 ఏళ్ల క్రితమే మరణించడంతో లావేరు హైస్కూల్ ఎదురుగా పెంకుటిల్లులో నివసిస్తోంది. ఒక కుమారుడు విశాఖలో ఉండగా.. మరో కుమారుడు లావేరు హైస్కూల్ సమీపంలోనే టిఫిన్ కొట్టు నడుపుతున్నాడు. కుమార్తెకు మురపాకకు చెందిన వ్యక్తితో వివాహమైనా ఆమె భర్త కొన్నాళ్లకే చనిపోవడంతో పిల్లలతో కలిసి తల్లి వద్దకే వచ్చేసింది. కాగా, కుమారులు తల్లిని పట్టించుకోకపోవడంతో సౌభాగ్య పాన్‌షాప్ పెట్టుకుని జీవనం సాగిస్తోంది. ఇటీవల కాలువ పనుల్లో భాగంగా పాన్‌షాపు తీసేశారు. దీంతో భర్త పేరిట ఉన్న స్థలంలో దుకాణం పెట్టుకునేందుకు ఇటీవల సౌభాగ్య ప్రయత్నించగా చిన్న కుమారుడు లక్ష్మణరావు అడ్డుకున్నాడు. చెక్కతో గాయపరచడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా రక్తపు గాయాలు కాలేదని, కేసు కట్టేది లేదని చెప్పారని, అందుకే ఎస్పీకి మొరపెట్టేందుకు వచ్చినట్లు వృద్ధురాలు వాపోయింది. సిబ్బంది సోమవారం రావాలని చెప్పడంతో వెనుదిరిగింది.

● జన జాతర



జామి ఎల్లమ్మ జాతర సందర్భంగా పలాస భక్తులతో పోటెత్తింది. కాశీబుగ్గ కేటీ రోడ్డు మొదలు కొని పలాస కేటీ రోడ్డు వరకు దారులన్నీ కిక్కిరిసిపోయాయి. – కాశీబుగ్గ